వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

● జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నీలగిరి, సెప్టెంబర్2 : వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గణేశ్ ఉత్సవాలపై శాంతి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో ఎలాంటి సంఘటనలు లేకుండా ఉత్సవాలను నిర్వహించాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి ప్రతి మండపానికి కరెంట్ కనెక్షన్ ఇవ్వాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా గజ ఈతగాళ్లతోపాటు క్రేన్‌లు, బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కువగా మట్టి వినాకులనే పూజించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ పోలీస్ యంత్రాంగం తరుపున భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, ఏదైనా సమస్య వస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. విగ్రహాలు ప్రతిష్ఠించే వారు ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాలన్నారు. సోషల్ మీడియాలో అనవసర సమాచారాన్ని పోస్ట్ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఆదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, టి.పూర్ణచంద్ర, డీఎఫ్ఓ రాజశేఖర్, శాంతి సంఘం సభ్యులు కర్నాటి విజయ్‌కుమార్, హఫీజ్‌ఖాన్, గోలి మధుసూదన్‌రెడ్డి, ఖలీల్, బీరెల్లి లక్ష్మీనారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, బీజేపీ నాయకులు మాదగోని శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : జడ్పీ సీఈఓ

తిప్పర్తి : మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

తిప్పర్తి/త్రిపురారం/మిర్యాలగూడ రూరల్, సెప్టెంబర్ 2 : జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా పరిషత్ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం తిప్పర్తి, త్రిపురారం, మిర్యాలగూడ మండలాల్లోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అధికారుల సెలవులు రద్దు చేసినందున ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు మండలంలోని పరిస్థితులను ఉన్నతాధికారులకు తెలుపాలన్నారు. చెరువులు, కుంటలు తెగినా, గండి పడే ప్రమాదం ఉన్నా ముందస్తుగా గుర్తించి ఆయా ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అవసరమైతే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. సమావేశంలో ప్రత్యేకాధికారి ఛాయాదేవి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, త్రిపురారం మండల ప్రత్యేకాధికారి శ్రీదేవి, ఎంపీడీఓ విజయకుమారి, భరద్వాజ్, మిర్యాలగూడ ఎంపీడీఓ శేషగిరి శర్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్యం : డీఎంహెచ్ఓ

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ శ్రీనివాస్

మర్రిగూడ, సెప్టెంబర్ 2 : సీజనల్ వ్యాధులపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్ఓ పి.శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని 30 పడకల ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విష జ్వరాలన్నీ డెంగ్యూ, మలేరియా కాదన్నారు. ప్రస్తుతం జిల్లాలో అలాంటి కేసులు నమోదు కాలేదన్నారు. ప్రజలెవరూ ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్ఓ రవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ శంకర్‌నాయక్, వైద్యాధికారి దీపక్, డా.సుమన్ పాల్గొన్నారు.

నీటి నిల్వ పనులకు అధిక ప్రాధాన్యం : డీఆర్‌డీఓ

శాలిగౌరారంలో మాట్లాడుతున్న పీడీ శేఖర్‌రెడ్డి

కట్టంగూర్/శాలిగౌరారం, సెప్టెంబర్ 2 : జాతీయ ఉపాధిహామీ పథకంలో నీటి నిల్వ పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని డీఆర్‌డీఓ యర్రబెల్లి శేఖర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కట్టంగూర్, శాలిగౌరం మండల పరిషత్ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో వేర్వేరుగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భావితరాలకు నీటి వనరులు అందించేందుకు ప్రతి గ్రామంలో పాంపాండ్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు, గ్రామాల్లో కూలీలకు సరిపడా పనులు కల్పించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓలు పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్‌రావు, జ్యోతిలక్ష్మి, తాసీల్దార్ యాదగిరి, మండల స్థాయి అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.వీరయ్య

మిర్యాలగూడ, సెప్టెంబర్ 2: రాష్ట్రంలో వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని బృందావన్ గార్డెన్స్‌లో నిర్వహించిన సీపీఎం జిల్లా స్థాయి ప్లీనరీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు అల్లాడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వరదల వల్ల మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలన్నారు. వరద ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలన్నారు. వానకాలం సీజన్ పూర్తి కావొస్తున్నందున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతు భరోసా సాయం అందించాలన్నారు. ఈ నెల 17 వరకు తెలంగాణ సాయుధ పోరాట వార్షోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు నారి ఐలయ్య, తుమ్మల వీరారెడ్డి, డబ్బికార్ మల్లేశ్, నాగార్జున, ప్రమీల, లక్ష్మీనారాయణ, ప్రభావతి, సయ్యద్ హాశం, వెంకటేశ్వర్లు, రవినాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

● డీఈఓ భిక్షపతి

ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న డీఈఓ భిక్షపతి

హాలియా, సెప్టెంబర్ 2 : విద్యార్థులకు నాణ్యమైన ఆహా రం అందించాలని, తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఈఓ భిక్షపతి ఆదేశించారు. హాలియాలోని కేజీబీవీని సోమవారం సాయంత్రం ఆయన సందర్శించారు. వంటగది, తరగతి గదులు, విద్యార్థులకు అందించే కూరగాయలు, నిత్యావసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట పాఠశాల ఎస్ఓ హైమవతి, సిబ్బంది ఉన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలి : ఎస్ఐ

నల్లగొండ సిటీ, సెప్టెంబర్ 2 : కనగల్ మండలంలో వినాయక చవితిని పురస్కరించుకొని విగ్రహాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని కనగల్ ఎస్ఐ విష్ణు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విగ్రహాలు ఏర్పాటు చేసేవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నిండిన చెరువులు.. పొంగుతున్న వాగులు

నల్లగొండ సిటీ, సెప్టెంబరు 2 : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని చాలా చెరువుల్లోకి పూర్తిస్థాయిలో నీరు చేరుతున్నది. దాంతో పాటు వాగులు, వంకలే పొంగి ప్రవహిస్తున్నాయి. కనగల్ మండలంలోని పలు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని కనగల్ కత్వా, దర్వేశిపురం వద్ద ఉన్న వాయిలేటి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఏఎమార్పీ కాలువ నీటితో పాటు భారీగా వర్షాల వల్ల వరద నీరు వచ్చి చేరడంతో కనగల్ మైలసముద్రం చెరువు పూర్తి స్థాయిలో నిండే దశకు చేరింది. దాంతో పాటు మండలంలోని జీ.ఎడవల్లి ఉత్తర, దక్షిణ చెరువుల్లోకి కూడా భారీగా వరద నీరు చేరింది. చెరువులు నిండుతుండడంతో వ్యవసాయ బోర్లలోకి సమృద్ధిగా నీరు వచ్చే అవకాశం ఉందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అలుగుపోస్తున్న కనగల్ కత్వ

కూలిన ఇంటిని పరిశీలిస్తున్న తాసీల్దార్ పద్మ, ఎంపీడీఓ జయరాం

పలు గ్రామాల్లో కూలిన ఇండ్లు

మూడు రోజులుగా కుస్తున్న వర్షాలకు కనగల్ మండలంలో ఐదు ఇండ్లు కూలినట్లు తాసీల్దార్ పద్మ, ఎంపీడీఓ జయరాం తెలిపారు. బుడమర్లపల్లిలో రెండు, రేగట్టెలో రెండు, జీ.ఎడవల్లిలో ఒక ఇల్లు కూలినట్లు పేర్కొన్నారు. సోమవారం కూలిన ఇండ్లను వారు పరిశీలించి బాధితులను పరామర్శించారు. ఆయా ఇండ్లల్లో ఉన్న వారిని ముందే సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో ప్రమాదం జరుగలేదని తాసీల్దార్ తెలిపారు.

కల్వర్టు పైనుంచి వరద నీరు

శాలిగౌరారం : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలోని అడ్లూర్ చెరువు పూర్తిగా నిండి అలుగు పోస్తున్నది. ఆ వరద నీరంతా ఊట్కూర్ గ్రామ శివారులో ఉన్న కల్వర్టు పైనుంచి ప్రవహిస్తుండడంతో ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్నది. ప్రజలు, వాహన దారులు వరద నీటిగుండానే భయం భయంగా ప్రయాణిస్తున్నారు.

వాడపల్లి వద్ద ఉధృతంగా కృష్ణానది

దామరచర్ల : నాగార్జునసాగర్, మూసీ ప్రాజెక్ట్ నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తుండడంతో మండలంలోని వాడపల్లి వద్ద కృష్ణా నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. సాగర్ నుంచి 5 లక్షల క్యూసుక్కుల నీటిని విడుదల చేస్తుండగా అవి టేయిల్‌పాండ్ ద్వారా నదిలోకి వదులుతున్నారు. దాంతో పాటు మూసీ ప్రవాహం కూడా వాడపల్లి సంగమం వద్ద కలిసి కృష్ణలో ప్రవాహం పెరిగి పుష్కరఘాట్లు, విద్యుత్తు స్తంభాలు నీట మునిగాయి. వాడపల్లి ఆలయాల వద్ద భక్తులు, జాలర్లు నదిలోకి వెళ్లవద్దని తాసీల్దార్ జవహర్‌లాల్ హెచ్చరించారు. సోమవారం వాడపల్లి వద్ద నీటి ప్రవాహాన్ని ఆయన పరిశీలించారు.

నక్కలగండితండాలోకి చేరిన వరద నీరు

చందంపేట : నక్కలగండి ప్రాజెక్టులోకి భారీగా నీరు చేరడంతో బ్యాక్ వాటర్ చందంపేట మండలంలోని నక్కలగండితండాలోకి భారీగా చేరింది. దాంతో తండావాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇండ్లలోకి వర్షపు నీరు చేరడంతో రాత్రి మొత్తం మెలుకువతో ఉండాల్సి వచ్చిందని స్థానికులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి స్థానికంగా పరిస్థితిని పర్యవేక్షించారు. డిండివాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మండలంలోని పోల్యనాయక్‌తండా, బొల్లారం, మోత్యతండా, యల్మలమంద, దేవరచర్ల తండావాసులు అప్రమత్తంగా ఉండాలని తాసీల్దార్ శ్రీనివాస్ సూచించారు.

నిండిన నల్లకుంట

పెద్దఅడిశర్లపల్లి : పాత పీఏపల్లిని ఆనుకొని ఉన్న నల్లకుంట ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పూర్తిగా నిండింది. ఏకేబీఆర్ రిజర్వాయర్ ఎగువన ఉన్న కుంట రిజర్వాయర్ నిర్మాణం కాకముందు నిండేది. రిజర్వాయర్ నిర్మాణం తర్వాత కుంటలోకి నీరు చేరక పోవడంతో చాలా భాగం అక్రమణకు గురైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మళ్లీ కుంటలోకి నీరు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శాలిగౌరారం: ఊట్కూర్ గ్రామ శివారులో ఉన్న కల్వర్టు పైనుంచి ప్రవహిస్తున్న వరద

వాడపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణామూసి నదులు

చందంపేట : నక్కలగండి తండాలో ఇంట్లోకి చేరిన వరద నీరు

పెద్దఅడిశర్లపల్లి : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఏకేబీఆర్ లిఫ్ట్ పంపుహౌస్‌లోకి చేరిన నీరు

ఉత్తమ ఫొటో జర్నలిస్టులకు సన్మానం

ఫొటోగ్రాఫర్ ఆకాశ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

రామగిరి, సెప్టెంబర్ 2: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డులు పొందిన ఫొటో జర్నలిస్టులకు సోమవారం రాత్రి టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అవార్డులు అందుకున్న ఆర్. ఆకాశ్(నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ముచ్చర్ల విజయ్ (ఆంధ్రజ్యోతి), ముచ్చర్ల శ్రీనివాస్(హన్స్ ఇండియా)తోపాటు పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎడ్ల సైదులు, పెరుమళ్ల ఆనంద్, నమస్తే తెలంగాణ బ్యూర్ మర్రి మహేందర్‌రెడ్డి, జర్నలిస్టులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని మెరుగు పర్చాలి : డీపీఓ మురళి

సిబ్బందికి సూచనలిస్తున్న డీపీఓ మురళి

మునుగోడు, సెప్టెంబర్ 2 : గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పర్చేందుకు చర్యలు తీసుకోవాలని డీపీఓ మురిళి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం మండలంలోని సింగారం గ్రామ పంచాయతీని ఆయన సందర్శించారు. రెండో వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి సలహాలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీఓ స్వరూపారాణి, గ్రామపంచాయతీ కార్యదర్శి గీత, గ్రామస్తులు పాల్గొన్నారు.

8న కూరెళ్లకు సాహితీ సంస్థల ఆధ్వర్యంలో సన్మానం

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సాహితీ సంఘాల నాయకులు

రామగిరి, సెప్టెంబర్ 2: ప్రముఖ సాహితీ వేత్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యకు ఈ నెల 8న సాహిత్య సేవా సంస్థల ఆధ్వర్యంలో పౌర సన్మానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం నల్లగొండలోని విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 10గంటలకు నల్లగొండలోని విశ్వకర్మ కమ్యూనిటీహాల్‌లో జరిగే సన్మాన సభకు సాహితీ అభిమానులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు పెందోట సోము, తండు కృష్ణకౌండిన్య, శ్రీనివాస్, అబ్బోజు మాదనాచారి, కన్నెకంటి సత్యనారాయణ, బండారు శంకర్, ఆనంద్ పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

● కేవీకే ప్రోగ్రా కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు

రైతులకు సూచనలిస్తున్న శ్రీనివాస్‌రావు

త్రిపురారం, సెప్టెంబర్ 2: అధిక వర్షాలు, వరదల వల్ల పత్తి, వరి, మిరప, కంది పంటలు దెబ్బతినకుండా రైతులు తగిన చర్యలు చేపట్టాలని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్‌రావు సూచించారు. సోమవారం నీట మునిగిన పంటచేలను సందర్శించి రైతులకు సూచనలు అందించారు. పొలాల్లో నీరు నిల్వ ఉండడంతో చీడపీడలు ఆశించే అవకాశం ఉందన్నారు. పొలాల్లో నీటిని తీసివేసిన తర్వాత రెండు శాతం యూరియా, ఒక శాతం పొటాషియం నైట్రేట్‌ను పిచికారీ చేయాలన్నారు. నేల మీద వ్యాపించే తెగుళ్లను నివారించేందుకు మూడు గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ మందును కలిపి మొక్కల మొదళ్లలో పిచికారీ చేయాలన్నారు. పత్తిలో అవసరాన్ని బట్టి పొటాషియం నైట్రేట్ 2శాతం 20 గ్రాముల నీటిని కలిపి 7-10 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలని, మిరపలో ఎకరానికి 30కిలోల యూరియా, 20 కిలోల పొటాష్‌ను కలిపి వేసుకోవాలని సూచించారు. ఆయన వెంట శాస్త్రవేత్తలు చంద్రశేఖర్, రైతులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

తిప్పర్తి, సెప్టెంబర్ 2 : మండలంలోని సర్వారం గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని నల్లగొండ సీడీపీఓ తూముల నిర్మల సోమవారం తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్ వివరాలను పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఆహార పదార్థాలు తడువకుండా జాగ్రత్త వహించాలని, పిల్లలకు, గర్భిణులకు నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్, ఆయాలు పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రల నిరసన

నీలగిరి, సెప్టెంబర్ 2 : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆరోగ్య మిత్రలు సోమవారం మున్సిపాలిటీ కార్యాలయంలోని వైఎస్ఆర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందించి నిరసన తెలిపారు. ఆరోగ్య మిత్రలను ప్రైవేటు ఏజెన్సీల నుంచి మినహాయించి ఆరోగ్యశ్రీ ట్రస్టు ఉద్యోగులుగా గుర్తించాలని, పనికి తగిన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్యమిత్రలు గోవిందర్‌రెడ్డి, నరేశ్, చెరుకు మల్లయ్య, ఆవుల వేణు, రామలింగయ్య, భరత్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

పోలీసుల ఆదుపులో గంజాయి స్మగ్లర్లు

నీలగిరి, సెప్టెంబర్ 2 : గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురిని నల్లగొండ పట్టణ శివారులోని మర్రిగూడ ప్రాంతంలో సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నల్లగొండ పట్టణానికి చెందిన ఐదుగురు యువకులు ఆంధ్రా నుంచి సుమారు 23 కిలోల గంజాయిని తీసుకొచ్చి మర్రిగూడ బైపాస్ సమీపంలోని ఒక ఇంటిలో నిల్వ ఉంచారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులకు దాడి చేసి గంజాయితో పాటు ఐదుగురిని పట్టుకున్నట్లు సమాచారం.

నేడు ఉపాధిహామీ సామాజిక తనిఖీ

నకిరేకల్, సెప్టెంబర్ 2 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం 14వ విడుత సామాజిక తనిఖీ సభను మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ ఆవరణలో నిర్వహించే సభకు సంబంధిత అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

నిడమనూరు, ఆగస్టు 2 : మండలంలోని ఇండ్లకోటయ్యగూడెం గ్రామానికి చెందిన సంపంగి ప్రసాద్(34) సోమవారం మధ్యాహ్నం బ్లేడుతో గొంతు, చేయి కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇంటి నుంచి బయటికి వెళ్లిన తల్లి వచ్చి చూసే సరికి మెడపై, చేతిపై గాయాలతో ప్రసాద్ అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. ఆమె స్థానికుల సాయంతో 108 అంబులెన్స్‌లో మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రసాద్ భార్య ప్రస్తుతం పుట్టింట్లో ఉండగా.. భార్య కాపురానికి రావట్లేదని మనస్థాపంతో అతను ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు భావిస్తున్నారు.

మర్రిగూడ మండల ప్రత్యేకాధికారిగా వేణుగోపాల్

మర్రిగూడ,సెప్టెంబర్ 2 : మండల ప్రత్యేకాధికారిగా బి.వేణుగోపాల్ సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ప్రత్యేకాధికారిగా పని చేసిన జేడీఏ ఎల్లయ్య బదిలీపై వెళ్లారు. ఆయనకు ఎంపీడీఓ చినమునయ్య, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

నిడమనూరు, ఆగస్టు 2 : మండల కేంద్రానికి చెందిన జినుకుంట్ల వెంకన్నకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును సోమవారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంకతి సత్యం, పట్టణాధ్యక్షుడు కుంచం సతీశ్ అందించారు. వెంకన్న ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతుండగా అతడి ఇంటికి వెళ్లి చెక్కు అందించారు. కార్యక్రమంలో నాయకులు కొండ శ్రీనివాస్‌రెడ్డి, పగిళ్ల శివ, మెరుగు మధు, ఉన్నం శ్రీనివాసరావు, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

రౌడీ షీటర్లపై నిరంతర నిఘా

వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి

నీలగిరి, సెప్టెంబర్ 2 : రౌడీ షీటర్లపై నిరంతరం నిఘా ఉంటుందని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని నల్లగొండ వన్‌టౌన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను సోమవారం బైండోవర్ చేశారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వినాయక చవితి ఉత్సవాల్లో ఏమైనా అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేసేందుకు యత్నించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్లు అందరూ ప్రతి వారం పోలీస్ స్టేషన్‌కు హాజరై సంతకాలు చేయాల్సి ఉంటుందన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, సెప్టెంబర్ 2: క్రైస్తవుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. నియోజకవర్గ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో నిర్వహించిన క్రైస్తవ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రైస్తవులు ఐక్యంగా ఉన్నట్లయితే బలమైన సంఘంగా ఏర్పడుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

నేషనల్ బాక్సింగ్ పోటీలకు మిర్యాలగూడ విద్యార్థులు

విద్యార్థులను అభినందిస్తున్న ఆర్డీఓ

మిర్యాలగూడ, సెప్టెంబర్ 2: పట్టణంలోని కేవీ స్కూల్ విద్యార్థులు అండర్-14, 17 విభాగంలో సెప్టెంబర్ 8న ఆగ్రాలో నిర్వహించే నేషనల్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు డీఎస్ఏ బాక్సింగ్ కోచ్ ఇ.రవీందర్‌గౌడ్ తెలిపారు. బాలికల విభాగంలో బి.యోగిత, ఎస్‌కే.ఫరీహ, బాలుర విభాగంలో సీహెచ్. విష్ణు, ఎస్‌కే.సుఫియాన్, ఎస్‌కే.రెయాన్ నేషనల్స్‌కు ఎంపికైనట్లు పేర్కొన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను సోమవారం ఆర్డీఓ శ్రీనివాస్‌రావు అభినందించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● జిల్లా మలేరియా నివారణ అధికారి దుర్గయ్య

వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న దుర్గయ్య

డిండి, సెప్టెంబర్ 2 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని జిల్లా మలేరియా నిర్మూలన అధికారి దుర్గయ్య సూచించారు. సోమవారం మండలంలోని చెర్కుపల్లి గ్రామాన్ని, మండల కేంద్రంలోని కేజీబీవీని ఆయన సందర్శించారు. దోమల ఉధృతిని తగ్గించ